విజిలెన్స్ వారోత్సవాల పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్ వారోత్సవాల పోస్టర్లను మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 27 నుంచి నవంబరు 2 వరకు నిర్వహించనున్న విజిలెన్స్ వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలన్నారు. నిబద్ధతో పనిచేస్తూ అవినీతి, అక్రమాల నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎల్ఎం కిట్స్ పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న ఎంఈవో

దండేపల్లి, అక్టోబరు, 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఎంఈవో రాజు చేతుల మీదుగా మంగళవారం టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం హెచ్ఎం సునీల్ కుమార్, ఉపాధ్యాయులు సౌజన్య, దుర్గాభవాని, అంగన్ వాడీ టీచర్ అనసూర్య ఉన్నారు.

ఆలయంలో అన్నదానం

మందమర్రిరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అందుగులపేటలోని కోర గట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ అన్న వితరణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల చివరి మంగళవారం ఆలయంలో అన్నదానం చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

భీమారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : భీమారంలోని రైతు వేదికలో మంగళవారం కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి అమ్మే విధానంపై రైతులకు మండల వ్యవసాయాధికారి అత్తె సుధాకర్ అవగాహన కల్పించారు. యాప్ ద్వారా స్లాట్ బుక్‌చేసుకుని పత్తిని విక్రయించాలన్నారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 శాతం ఉండేలా చూడాలన్నారు. ఏఈవో అరుణ్‌కుమార్ ఉన్నారు.

ప్రైవేటు బస్సులకు తగ్గిన ఆదరణ

- కర్నూలు ప్రమాదంతో... తగ్గుముఖం పట్టిన బుకింగులు
- ఆర్టీసీ సర్వీసుల వైపే ప్రయాణికుల మొగ్గు
- నాలుగైదు రోజులుగా క్రమంగా పెరుగుతున్న రద్దీ
- దూర ప్రాంతాలకు అదనపు బస్సులు నడుపుతున్న ఆర్టీసీ

మంచిర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం ప్రజల కళ్లముందు ఇంకా కదలాడుతూనే ఉంది. ఆ ప్రమాదంలో ఓ ప్రైవేటు బస్సు అగ్నికి ఆహుతికాగా, అందులో ప్రయాణిస్తున్న 19 మంది మృత్యువాత పడ్డారు. ఇంకా ఆ చేదు జ్ఞాపకాలు చెదిరిపోకపోవడంతో దూర ప్రాంతాలకు బస్సు ప్రయాణం అంటేనే ప్రజలు జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం అంటేనే వెనుకంజ వేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తే రైళ్లనో, ఆర్టీసీ బస్సులనో ఆశ్రయిస్తున్నారు తప్ప, ప్రైవేటు బస్సుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ పరిస్థితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. కర్నూలు ప్రమాదం జరిగిన నాటి నుంచి ప్రైవేటు బస్సుల్లో బుకింగులు గణనీయంగా తగ్గుముఖం పట్టగా, ఆర్టీసీ సర్వీసులకు ఆదరణ పెరగడమే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఉమ్మడి జిల్లా నుంచి ప్రైవేటు సర్వీసుల రాకపోకలు....

సాధారణ రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యం పది వరకు ప్రైవేటు బస్సు సర్వీసులు మంచిర్యాల నుంచి హైదరాబాద్ మీదుగా బెంగుళూరు, కర్నూలు, అనంతపూర్ లాంటి దూర ప్రాంతాలకు వోల్వో ఏసీ, నాన్ ఏసీ, స్లీపర్, సీటర్ సర్వీసులు ప్రయాణికులను చేరవేస్తుంటాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి నిత్యం సగటున 200 మంది వరకు ప్రైవేటు బస్సులపై ఆధారపడి ప్రయాణాలు చేస్తుంటారు. పండుగలు, సెలవు దినాల్లో ప్రయాణికుల సంఖ్య మరింత అధికంగా



ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన వందలాది మంది యువత బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తుండగా, వారంతా ప్రత్యేక దినాల్లో సొంతూళ్లకు వస్తుంటారు. తిరుగు ప్రయాణంలో రవాణా సౌకర్యం అంతగా అందుబాటులో ఉండక, వివిధ కంపెనీలకు చెందిన ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తుంటారు. ఇందు కోసం నాలుగైదు రోజుల ముందే సీట్లు బుక్ చేసుకుంటారు. ప్రతి నిత్యం సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతం నుంచి ప్రైవేటు సర్వీసులు బయల్దేరుతుండగా హైదారాబాద్ మీదుగా బెంగుళూరు వంటి దూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటాయి.

తగ్గుముఖం పట్టిన బుకింగులు...

కర్నూలులో బస్సు ప్రమాదం జరిగిన నాటి నుంచి ప్రైవేటు సర్వీసుల్లో బుకింగులు గణనీయంగా తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి నిత్యం సగటున పది వరకు ప్రైవేటు సర్వీసులు నడవాల్సి ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య సగానికి పడిపోయినట్లు తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా నుంచి ప్రైవేటు ఆపరేటర్లు నిర్వహించే కంపెనీలు ఐదారు ఉన్నాయి. వాటిలో మైత్రి టూర్స్ అండ్ ట్రావెల్స్, ఐఆర్ఏ ట్రాన్స్‌పోర్ట్స్, ఆరేంజ్ టూర్స్ అండ్ ట్రావెల్స్, మార్నింగ్ స్టార్ ట్రావెల్స్, న్యూ ధనుంజయ ట్రావెల్స్‌కు చెందిన బస్సులు మంచిర్యాల..

(తరువాయి 7లో)

ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది..

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ భవానీ ప్రసాద్

గత నాలుగైదు రోజులుగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో రీజియన్ పరిధిలోని నాలుగు జిల్లాల నుంచి అదనంగా పది సూపర్ లగ్జరీ సర్వీసులను హైదరాబాద్‌కు నడుపుతున్నాం. ఆయా సర్వీసుల ద్వారా నిత్యం 300 మంది వరకు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు సుశిక్షితులు కావడం, తరుచుగా బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తుండటంతో మద్యం సేవించే అవకాశాలు ఉండక సహజంగానే ప్రమాదాల సంఖ్య అతి తక్కువగా ఉండటంతోపాటు భద్రత ఉంటుందనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులను ఆశ్రయిస్తున్నట్లు భావించాల్సి వస్తోంది.

శాంతి భద్రతల్లో ప్రజలు పాలుపంచుకోవాలి

● డీసీపీ భాస్కర్

మంచిర్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పాలుపంచుకోవాలని, పోలీసులు ప్రజల రక్షణ కోసమేనని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. మంగళవారం అమర వీరుల సంస్మరణ సభలో భాగంగా సీసీ నుంచి మంచిర్యాల ఐబీ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించేందుకే పోలీసులు ఉన్నారన్నారు. పోలీసులు రక్షణగా ఉన్నారు కాబట్టే ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్నారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వారిపై, మత్తుకు బానిసయ్యే వారిపై నిఘా ఉంచి వారి సమాచారాన్ని పోలీసులకు అందించి శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. దేశానికి ఆర్మీ రక్షణ కల్పిస్తుండగా ప్రజలకు పోలీసులు రక్షణ కల్పిస్తున్నారన్నారు. ప్రజల రక్షణ కోసం ఎందరో పోలీసులు ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రజల కష్ట నష్టాలను దూరం



సైకిల్ ర్యాలీలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్

చేయడం, ధన, మాన, ప్రాణాలను కాపాడడం మా బాధ్యత అన్నారు. బాధితుల పట్ల సానుభూతితో ఉండడం వల్లనే కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, నరేష్ కుమార్, బన్సిలాల్‌లతో పాటు భవన నిర్మాణ సంఘ నాయకులు, ప్లంబర్, ఎలక్ట్రికల్ సంఘం నాయకులు, యోగా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు

రూ. 26 వేల వేతనం చెల్లించాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆశాకార్యకర్తలకు నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ కోరారు. మంగళవారం మంచిర్యాలలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయ న్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించారన్నారు. ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు రూ. 26 వేతనం ఇవ్వాలని, భీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి సంకె రవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, నాయకులు శోభ, విజయలక్ష్మీ, రాణి, సువర్ణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



కస్తూర్బా పాఠశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో సౌకర్యాలు విద్యాబోధన నాణ్యతలపై తరగతి గదుల్లో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంటశాల, రిజిష్టర్స్, మధ్యాహ్న భోజనం, నాణ్యత, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో స్వచ్ఛమైన మంచి నీరు, ఆహారం అందించాలన్నారు. అంతే కాకుండా నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

గుడిపేట 13వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

హాజీపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : పోలీసు వారోత్సవాలను పురస్కరించుకొని గుడిపేట 13వ బెటాలియన్‌లో పి. వెంకటరాములు ఆధ్వర్యంలో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డీఆర్ఎఫ్ విభాగంలోని పరికరాలను ప్రదర్శిస్తూ రాష్ట్రంలో సంభవించే విపత్తులను ఎలాంటి విధానాలతో ఎదుర్కొంటారో, ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ఏ పరికరాలను ఎక్కడ వినియోగిస్తారో ఎస్‌డీఆర్ఎఫ్ ఆర్ఐ అశోక్, సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గుడిపేట కేంద్రీయ విద్యాలయ, మంచిర్యాల టెక్నో స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వరరావు, బాలయ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ జయంతిని విజయవంతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 31 నుంచి నవంబర్ 25 వల్లభాయ్‌పటేల్ జయంతి ఉత్సవాలీను నిర్వహిస్తామని కార్యకర్తలు, ప్రజలు ప్రతీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 31న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శులు శ్రీధర్, మహేందర్‌గౌడ్, నాయకులు నాగేశ్వర్‌రావు, చక్రవర్తి, స్వామిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి



వినతి పత్రం అందజేస్తున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. మంగళవారం నాంపెల్లిలో కేంద్రం సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎన్‌జీవో సభ్యత్వ నమోదును మంచిర్యాల జిల్లాలో డిసెంబరు వరకు పూర్తి చేస్తామన్నారు. సీపీఎస్ విధానాన్ని పాత పెన్షన్ విధానం రావడానికి ప్రణాళిక తయారు, డీఏలను త్వరగా ఇప్పించేందుకు, జిల్లా టీఎన్‌జీవో హౌసింగ్ సొసైటీ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు, పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం కార్యదర్శి మల్లయ్య, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



దండేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

దండేపల్లి, అక్టోబరు, 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరా క్రాంతి పథకం, మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని రైతులు మంచి నాణ్యతతో కూడిన ఏగ్రేడ్ ధాన్యం కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ, పంచాయతీ రాజ్ సంగటన్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కట్కూరి రాజన్న, బండ రాకేష్, నాయకులు వెంగల్‌రావు, తిరుపతి గౌడ్, వీవోఏ బుర్ర వాణిశ్రీ, గ్రామైఖ్య సభ్యులు మన్న పద్మ, బుర్ర అపర్ణ, విజయ, ఆజ్మీర వసంత, రైతులు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఐకేపీ వీవో అధ్యక్షురాలు మద్దుల సునీతా రెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులుదళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సీసీ ప్రశాంత్ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో మంగళవారం ఐకేపీ మణికంఠ వీవో సంఘం ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం మహిళలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని పేర్కొన్నారు. సీఏ శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

దేవాలయం ప్రారంభానికి ఆహ్వానం

కాసిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవాపూర్ మద్దిమాడ గ్రామంలో నవంబర్ 8న ప్రారంభం కానున్న స్వయంభు శివాలయంకు రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌లను ఆహ్వానించినట్లు ఆలయ కమిటీ నిర్వహకులు శ్రీనివాస్, బీంరావులు తెలిపారు. మద్దిమాడలో స్వయంభుగా వెలిసిన శివలింగానికి ఆలయం కట్టించామని తెలిపారు. ఆలయ ప్రారంభానికి మంత్రులను ఆహ్వానించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పక్కన డీసీపీ భాస్కర్, సబ్‌కలెక్టర్ మనోజ్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో డీసీపీ భాస్కర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీసు, రెవెన్యూ, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 7 వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్‌పోలీసులు రోడ్లపై అనధికర వాహనాల నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు హైద్రాబాద్-కరీంనగర్- చంద్రపూర్ రహదారిపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, బాసర -లక్షెట్టిపేట రాష్ట్రీయ రహదారి 24పై ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నందున భద్రత చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్‌లు సెల్లార్ స్థలాలను కేవలం పార్కింగ్ కోసమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, నాళాలపై అనధికార నిర్మాణాలను వెంటనే తొలగించాలన్నారు.

శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు బస్టాండ్ వెనక భాగానికి మార్చాలని, బస్టాండ్‌కు సంబంధించిన అటవీ అనుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మంద మర్రి వంతెన వద్ద కూరగాయల వ్యాపారులు ఆక్రమించిన ప్రదేశాలను క్లియర్ చేయాలని, హైవేలకు వెళ్లే రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో లైసెన్స్‌లు రద్దు అయిన వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీల్లో పట్టుబడిన వాహనాల వివరాలను ప్రతివారం ప్రజలకు తెలియజేయాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

లక్షెట్టిపేట, అక్టోబరు, 28(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట న్యాయస్థానంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గాండ్ల సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకాలం అధ్యక్షుడిగా కొనసాగిన కొమిరెడ్డి సత్తన్న పదవీకాలం ముగియడంతో ఆయన నుంచి పూర్తి బాధ్యతలు చేపట్టడం జరిగింది. సత్యనారాయణను లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయి కిరణ్ కసమలతో పాటు ఏపీపీ అజయ్‌కుమార్, న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో ఎలక్షన్ కమిషనర్ గోవింద్ రావు, ఏజీపీ సంతోష్, ఉపాధ్యక్షుడు నళినికాంత్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ సత్యగౌడ్, సీనియర్ న్యాయ వాదులు రాజేశ్వర్‌రావు, కేతిరెడ్డి భూమారెడ్డి, కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, కిరణ్ కుమార్, రవీందర్, రాజేశ్వ ర్, రహమతుల్లా, పద్మ, సుమన్ చక్రవర్తి, సంజీ వ్, గణేష్, శివశంకర్ పాల్గొన్నారు.



సత్యనారాయణను సన్మానిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్

పాము కాటుతో మహిళ మృతి


సంధ్యారాణి(ఫైల్)

కెరమెరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్ ఖేడ గ్రామానికి చెందిన మోహర్లె సంధ్యారాణి(31) అనే మహిళ పాము కాటుతో మంగళవారం మృతి చెందింది. సంధ్యారాణి సోమవారం పత్తి ఏరుతుండగా పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబీకులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. సంధ్యారాణికి భర్త తులసీ రాం, కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త తులసీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

సికిల్‌సెల్‌తో యువకుడు..


భార్గవ్(ఫైల్)

కాసిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలో కాంట్రాక్టు పద్ధతిన ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దుగుట భార్గవ్ (31) అనే యువ ఉద్యోగి సికిల్‌సెల్‌తో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం భార్గవ్ బెల్లంపల్లి మండలంలో కాంట్రాక్టు పద్ధతిన ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత వారంలో బెల్లంపల్లి ఎంపీడీవో టీపీ భార్గవ్‌కు మెమో ఇచ్చాడు. సికిల్‌సెల్‌తో బాధపడుతున్న భార్గవ్ మెమో ఇవ్వడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు స్థానికంగా వైద్య సేవలు అందించారు. మంగళవారం ఉదయం ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. భార్గవ్ మృతితో మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. సహ ఉద్యోగులు మాట్లాడుతూ ఎంపీడీవో వేధింపుల వల్లనే భార్గవ్ ఒత్తిడికి గురై మృతిచెందాడని ఆరోపించారు. కొంత కాలంగా సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నట్లు సహ ఉద్యోగులు ఆరోపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఆర్‌డీవోపీడీ కిషన్ మృతుని కుటుంబీకులను పరామర్శించారు. జరిగిన ఘటనపై పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు.

కుక్కలదాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు


గాయపడిన లక్ష్మి

బెల్లంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వార్డులో పాలు విక్రయించి జీవనం సాగించే దారవెల్లి లక్ష్మి అనే వృద్ధురాలిపై మంగళవారం వీధి కుక్కలు మీదపడి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. పాలు విక్రయించి ఇంటికి వెళ్తున్న క్రమంలో వీధి కుక్కలు ఒక్కసారిగా వృద్ధురాలి మీదపడి దాడి చేశాయి. దీంతో ఆమె కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడికి దగ్గరలో ఉన్న వ్యక్తులు వచ్చి కుక్కలను కర్రలతో కొట్టడంతో పారిపోయాయి. వృద్ధురాలిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలి

బెజ్జూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెర్రె గ్రామంలో కుల దురహంకార హత్యకు గురైన నిండు గర్భిణి శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజ సంఘం, కోలావార సంఘం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్‌పై అవగాహన కరువు



- ఏళ్ల తరబడి ఉనికే లేని పథకం
- కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20వేల సాయం



బెజ్జూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశ పెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్) గురించి అవగాహన లేక పోవడంతో నిరుపేదలు ఆర్థిక సాయానికి దూరమవుతున్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబానికి ఒకింత సహాయం అందించి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని అమలు చేస్తోంది. పేదలకు ఎంతో మేలు చేస్తున్నందున బాధిత కుటుంబాల వారు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలి. కేంద్రం పేదలను ఆదుకునేందుకు ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం అమలవుతున్నా ప్రజలకు అవగాహన లేకపోవడంతో సహాయం కోసం దరఖాస్తులు పెద్దగా రాలేదు.

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న..

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబంలోని పెద్ద చనిపోతే సంబంధిత ధ్రువ పత్రాలతో గ్రామ, మండల అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.20వేల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోంది. కుటుంబంలోని వితంతువు, అవివాహిత కుమార్తె, కుమారుడికి ఈ ప్రయోజనం లభిస్తుంది. కుటుంబ పెద్ద 18 నుంచి 60ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. సాధారణ, ప్రమాదవశాత్తు మృతి చెందిన రెండేళ్లలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

మండల పరిషత్ కార్యాలయానికి దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆమోదం తర్వాత సహాయం కోసం ప్రభుత్వానికి సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. కానీ పేద కుటుంబాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పరంగా మండల, గ్రామ స్థాయిలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నా ఏనాడు ఇలాంటి మంచి పథకం ఉందన్న విషయం ప్రజలకు తెలియపర్చడం లేదు. నామమాత్రంగా అర్జీలు వస్తున్నాయంటేనే ప్రజలకు ఈ పథకంపై తెలియకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. గ్రామాల్లో సైతం ఈ పథకం ఉందన్న విషయం ప్రజలకు తెలియక దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు.

గ్రామసభల్లో వివరిస్తున్నాం..

ప్రవీణ్‌కుమార్, బెజ్జూరు ఎంపీడీవో



పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం గురించి గ్రామ సభల్లో ప్రజలకు తెలియజేస్తున్నాం. ఈ పథకంలో లబ్ధి పొందాలంటే ప్రభుత్వం సూచించిన ధ్రువపత్రాలు తప్పనిసరి. డెత్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటో, రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ పత్రాలు, బ్యాంకు ఖాతా జిరాక్సు కాపీలతో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

రికార్డుల పరిశీలన

వాంకిడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని జేఎంవో డాక్టర్ సంపత్ మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం వల్ల అంగవైకల్యం రాకుండా నివారించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఎండీటీ డ్రైయంత్రాలను వాడడం వల్ల సకాలంలో వ్యాధి నివారించవచ్చని చెప్పారు. వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ పీఎంవో సకలరెడ్డి, ఏపీఎంవో రుణ, డీఎస్‌వో సురేందర్, వైద్యాధికారులు వినయ్, జేసీల, అయేషా, ప్రసాద్, లెప్రసీ, ఎన్‌పీ శ్యాంలాల్ పాల్గొన్నారు.

పశువులకు టీకా

చింతమానేపల్లి/దహెగాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. కార్యక్రమంలో సిబ్బంది కేశవ్, రాజన్న, స్రవంతి, దక్షణమూర్తి, యశ్వంత్, రైతులు పాల్గొన్నారు. దహెగాం మండలం ఖర్జీ గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. 393 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని పారదర్శకంగా నిర్వహించాలి


సదరం శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ధ్రువపత్రం పునరుద్ధరణ, నూతన ధ్రువపత్రాల కోసం జిల్లాలో చేట్టిన సదరం శిబిరాలను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని సందర్శించి అభ్యర్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు ధ్రువపత్రాలు అందించేందుకు సదరం శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు, సహాయకుల కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అర్హతలు కలిగిన వారందరికి సదరం సర్టిఫికెట్ అంజేయాలని సూచించారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్య రంగాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. రెబ్బెన మండలం గంగాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న పెయింటింగ్, తరగతి గదుల మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన విద్యను అందంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

నవంబరులో ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలు

కాగజ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరులో ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేశ్వరమ్మ అన్నారు. ఎస్పీఎం మిల్లులో ట్రేడ్ ఎన్నికల నిర్వహణపై మంగళవారం ఆదిలాబాద్ కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎస్పీఎం పునరుద్ధర జరిగిన తర్వాత ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరుగలేదని, దీంతోకార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా డిప్యూటి లేబర్ కమిషనర్ మాట్లాడుతూ నవంబరులో ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేశ్వరమ్మ ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, ఎస్పీఎం యూనియన్ 2735 అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి కల్లూరి శ్రీనివాస్‌తో ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ 1028 సంఘం అధ్యక్షులు కలికోట రమణయ్య, ప్రధాన కార్యదర్శి బింగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

భీమారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు మంగళవారం మంచిర్యాల అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రామమోహన్‌రెడ్డి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ తెలిపారు. మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన శంకరమ్మ అనే మహిళపై దుర్గం సమ్మయ్య, దుర్గం లియ్యలు హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు పంపగా సాక్షుల ను విచారించిన జడ్జి నేరం రుజువు కావడంతో దుర్గం సమ్మయ్యకు 5 సంవత్సరాల జైలు శిక్ష రూ. 5 వేల జరిమానా, దుర్గం లింగయ్యకు ఏడాది సాధారణ జైలు శిక్ష , రూ. వెయ్యి జరి మానా విధించినట్లు తెలిపారు. ఈ కేసు లో భీమారం ఎస్‌ఐ శ్వేత, కోర్టు కానిస్టే బుల్ ధర్మయ్యలు సాక్షులను ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ రవీందర్ వాదించి శిక్ష పడేలా చేశారని తెలిపారు.

ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట వేయాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం రాధాక్రిష్ణ

మందమర్రిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధికి నిరంతరం పాటుపడు తున్న సింగరేణి ఉద్యోగుల ఆరోగ్యానికి వైద్య సిబ్బంది పెద్దపీట వేయాలని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ తెలిపారు. మంగళవారం ఏరియాలోని కేకే1 డిస్పెన్సరీని ఆయన సందర్శించారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా డిస్పెన్సరీ సూప రింటెండెంట్ నాగేశ్వర్‌రావును, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారిగా వైద్యశాలకు వచ్చే రోగుల వివరాలను కూడ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఉద్యోగులకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఏమైన వైద్యంకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టి కి తీసుకరావాలన్నారు. మందుల కొరత ఉంటే కూడ చెప్పాలన్నారు. సంస్థలో ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ కూడ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంతేగాకుండా పరిసరాల పరిశుభ్రతపై పెద్దపీట వేయాలని సూచించారు. వైద్యశాలకు వచ్చే వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, ఐఈడీఎస్ కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడొద్దు

ఆసిఫాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, కాగజ్‌నగర్, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మనలు దేవయ్య, విశ్వనాథ్‌లతో, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్, రవాణా ప్రాథమిక సహకార, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం వరి ధాన్యం, పత్తి, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు 40 కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఆయా కేంద్రాల్లో రైతులకు కొరకు తాగునీరు, నీడ, కనీస మౌలిక వసతులు, టార్పాలిన్ కవర్లు, గోనె సంచులు, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను ఎత్తు ప్రదేశంలో ఉండేలా చూసుకోవాలని, ఐతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తరువాత కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చే విధంగా వ్యవసాయ విస్తరణ అధకారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. పత్తి కొనుగోళ్లలో ఈ సారి కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నందున ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం యూరియా కొరత ఉన్నప్పటికీ వ్యవసాయ అధికారులు సమన్వయంతో వ్యవహరించి రైతులకు యూరియా సకాలంలో అందించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో వరి ధాన్యం, పత్తి కొనుగోళ్లలో క్రియాశీలకంగా వ్యవహరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పని చేయాలని కోరారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాలలో ఒకటి, దహెగాంలో ఒకటి వరి కొనుగోలు కేంద్రాలను అదనంగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటి, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న అంగవైకల్య నిర్ధారణ కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే మంగళవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగవైకల్యం నిర్ధారణ కేంద్రంలో అవసర మైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అంగవైకల్యం కలిగిన పెన్షదారుల పునరుద్ధరణ కోసం నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారికి అంగవైకల్య నిర్ధారణ చేసి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్ధారణ కేంద్రంలో అంగవైకల్యం కలిగిన వారికి, సహాయకులుగా వచ్చే వారి కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పరీక్ష పరికరాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నిర్ధారణ కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు తల్తెతకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అదికారి దత్తారాం, ఆసుపత్రి పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ధాన్యం పట్టివేత


అధికారులు పట్టుకున్న ధాన్యం

కోటపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ధాన్యాన్ని మంగళవారం మండలంలోని పారుపెల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మహారాష్ట్రలోని సిరొంచ నుంచి బూర్తి మల్లయ్య అనే వ్యక్తి 254 బస్తాల వరిధాన్యాన్ని చెన్నూరుకు తరలిస్తుండగా పారుపల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు ధాన్యాన్ని స్వాధీనం చేసుకుని సంబంధితశాఖ అధి కారులకు అప్పగించామని తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

వేమనపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం బద్దెంపల్లి గ్రామానికి చెందిన నాయిని గట్టయ్య తన ఆటోలో బోగారపు బాపు, మరో ఇద్దరితో కలిసి అవసరం నిమిత్తం నాగారం గ్రామానికి వెళ్లాడు. తిరిగి నాగారం నుంచి నీల్వాయి మీదుగా బద్దెంపల్లికి వెళ్తుండగా నీల్వాయి సమీపంలో ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ గట్టయ్యకు, మరోవ్యక్తికి స్వల్ప గాయాలు కాగా బోగారపు బాపు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందు కుంటున్న కుటుంబీకులు, స్థానికులు గాయాలైన వారిని 108 అంబులెన్స్‌లో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అండర్‌గ్రౌండ్ అలవెన్సులు అందించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

శ్రీరాంపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కంపెనీ అవసరాల నిమిత్తం సర్ఫేస్‌లో పనిచేస్తున్న అండర్‌గ్రౌండ్ కార్మికులకు అలవెన్సులు కట్ చేయకుండా అందజేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం కుర్మ రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ఆడిట్ కటింగ్ పేరిట అండర్‌గ్రౌండ్ అలవెన్సులను వేతనాల నుంచి కట్ చేయవద్దన్నారు. జీఎం కార్యాలయ ప్రాంగణంలోని సివిల్ సెక్షన్‌లో ఏసీ సౌకర్యం కల్పించాలని, జనరల్ అసిస్టెంట్ల సమస్యను పరిష్కరించాలన్నారు. అన్ని కాలనీల్లోని క్వార్టర్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, రోడ్డు నెంబర్, క్వార్టర్ నెంబర్లను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్కే 7 గనిపై సపోర్టుమెన్ల కోసం రూమును నిర్మించాలని, ఆర్కే న్యూటెక్ గనిపై జనరల్ మజ్దూర్ల షెడ్డుకు మరమ్మతులు చేయించాలన్నారు. ఎస్ఆర్‌పీ 1 గనిపై లైన్‌మెన్, ఫిట్టర్, మెకానికల్ ఫోర్‌మెన్ రూములలో స్లాబు లీకేజీలను అరికట్టాలని ఈ సందర్భంగా సూచించారు. రెస్ట్‌హాల్‌లోకబోర్డు ఏర్పాటు చేయాలని, ఎస్‌డీఎల్ ఆపరేటర్, ఫిట్టర్, క్లరికల్ ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్కే 8 డిస్పెన్సరీలో అదనంగా మరో ల్యాబ్ టెక్నీషియన్‌ను కేటాయించాలన్నారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో వ్యాగన్ షంటింగ్ మజ్దూర్ల కోసం షెడ్డు నిర్మించాలని, ఎస్ అండ్ పీసీ డిపార్ట్‌మెంట్‌లో క్లర్క్‌ను నియమించాలని, పాడైన చెక్‌పోస్టు షెడ్లను రిపేర్ చేయించాలని, సివిల్ విభాగంలోని అన్ని పంపుహౌస్‌ల వద్ద సరిపడా దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలను విన్న ఇన్‌చార్జి జీఎం వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏజెంట్ శ్రీధర్, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్ కువర్, రవీందర్, మల్లయ్య, సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రలింగం, సీనియర్ పీవో సురేందర్, సీనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కొట్టె కిషన్‌రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, నాగభూషణం, బద్రి బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 48 పశువులు స్వాధీనం

బెజ్జూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి జగిత్యాల వైపు అక్రమంగా తరలిస్తున్న 48 పశువులను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సర్తాజ్ పాషా అన్నారు. పక్కా సమాచారం మేరకు మండలంలోని ఇప్పలగూడ గ్రామ సమీపంలో తనఖీలు చేపట్టామని చెప్పారు. 48 పశువులను ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా ప్రశ్నించామని అన్నారు. ఇప్పలగూడకు చెందిన పెగడపల్లి సరేష్, తరగం ఆనందరావు అనే వ్యక్తులు మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి జగిత్యాలకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని చెప్పారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పశువులను అక్రమంగా తరలించడం నేరమని అన్నారు. ఎవరైనా అక్రమంగా తరలిస్తున్నట్లు గ్రామస్థులు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

బెల్లంపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పద్మశాలిభవన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏసీపీ రవి కుమార్ తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి పెద్ద ఎత్తున యువత రావాలని ఉదయం 9గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. బెల్లంపల్లి సబ్ డివిజన్‌లోని పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

పోచమ్మతల్లి బోనాలు

బెల్లంపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 34వ వార్డులోని హనుమాన్ బస్తీలో మంగళవారం భూలక్ష్మీ పోచమ్మతల్లి బోనాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ వాసులు, మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నియామకం


శ్రీనివాస్(ఫైల్)

నెన్నెల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాజ్యాధి కార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నెన్నెల మండలం కోనంపేట గ్రామానికి చెందిన రాంటెంకి శ్రీనివాస్ నియమితులయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న శ్రీనివాస్ నియామకాన్ని మంగళవారం ప్రకటించారు. తనపై నమ్మకంతో జిల్లా స్థాయి పదవి అప్పగించిన అధిష్టానానికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో టీఆర్‌పీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉపాధిహామీలో అక్రమాలు



లక్షల రూపాయల నిధులు స్వాహా చేసిన సిబ్బంది

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

బెల్లంపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సిబ్బంది అందరూ కుమ్మక్కై లక్షల రూపాయలు దండుకున్న ఘటన బెల్లంపల్లిలో చోటు చేసుకుంది.

నిధుల దుర్వినియోగం..

బెల్లంపల్లి మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 కేంద్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసింది. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పాఠశాలలకు ప్రహరీలు, ఆయా గ్రామాల్లో నర్సరీలు, నీటి గుంతలు ఏర్పాటు చేశారు. నీటి గుంతలకు, నర్సరీలకు, పాఠశాలల ప్రహరీలకు ఎంత నిధులు ఖర్చు చేశారనే విషయాన్ని సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ పలు గ్రామాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయకపోగా, మరికొన్ని గ్రామాల్లో నాసిరక బోర్డులు ఏర్పాటు చేశారు. ఒక్కో సమాచార


శిథిలమైన సమాచార బోర్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4వేల చొప్పున నిధులను మంజూరు చేస్తుంది. మండలంలోని 17 గ్రామాల్లో మొత్తం 146 సమాచార బోర్డులకు రూ.5 లక్షల74వేలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదే అదనుగా ఉపాధిహామీలో విధులు నిర్వహించే ఈసీతో పాటు టీఏలు కుమ్మక్కై సమాచార బోర్డులను ఏర్పాటు చేయకుండానే లక్షల రూపాయల నిధులను స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి ఈ నిధుల దుర్వినియోగం చేసిన సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం...

మహేందర్, ఎంపీడీవో బెల్లంపల్లి

మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద వచ్చిన నిధులతో సమాచార బోర్డులను ఏర్పాటు చేయకుండ బిల్లులు తీసుకున్నారనే విషయం దృష్టికి వచ్చింది. ఈ విషయంపై విచారణ చేపట్టగా పలు గ్రామాల్లో సమాచార బోర్డులను ఏర్పాటు చేయలేదు. అలాగే పలు ప్రాంతాల్లో నాసిరకంగా నిర్మించడంతో ధ్వంసమయ్యాయి. దీంతో ఉపాధి ఈసీ అనిల్, టీఏలు భార్గవ్, సుధాకర్, సుష్మ, విజయలు అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాం.

పోలీసు అమరవీరులకు ఘన నివాళులు

సైకిల్ ర్యాలీ ప్రారంభించిన డీసీపీ


నస్పూర్‌లో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీసీపీ భాస్కర్, పోలీసు అధికారులు

నస్పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ వద్ద పోలీసు అమరవీరులకు మంగళవారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీసీసీ కార్నర్ నుంచి మంచిర్యాల వరకు సైకిల్ ర్యాలీ జరిగింది. సైకిల్ ర్యాలీని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ప్రారంభించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పోలీసులతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు. సీసీసీ కార్నర్ నుంచి సైకిల్ ర్యాలీ మంచిర్యాల పట్టణంలోని ఐబీ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు, నస్పూర్ ఎస్‌ఐ ఉపేందర్ రావు, డివిజన్‌లోని పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుడుంబా నిర్మూలనకు గ్రామస్థుల ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

వేమనపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగారం గ్రామంలో మంగళవారం గుడుంబా నిషేధం కోస గ్రామస్థులు ఏకగ్రీవం గా తీర్మానం చేశారు. గ్రామంలో ఇక నుంచి గుడుంబా తయారు చేయడం, అమ్మవద్దని నిర్ణయించారు. తీర్మానానికి కట్టుబడి ఉండకుండా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా సంబంధిత అధికారులకు పట్టిస్తామని తెలిపారు. గ్రామంలో గుడుంబాతో దళిత గిరిజనకుటుంబాలు రోడ్డున పడుతున్నాయని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గుడుంబా నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

జైపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే సమాజంలో విద్యార్థులకు మంచి గుర్తింపు లభిస్తుందని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెల్ప్ ప్రోగ్రామ్ అండ్ యాంటీ డ్రగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. గంజాయి, సిగరెట్లకు దూరగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ , కళాశాల ఇన్‌చార్జీప్రిన్సిపల్ బండి ప్రసాద్, అధ్యాపకులు మంజుల, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్యకవిత, శ్రీకాంత్, రవీందర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు మంత్రి వివేక్ పరామర్శ


హరీశ్‌రావును పరామర్శిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాక మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి హైద రాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వెళ్లి సత్యనారాయణరావు మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం హరీశ్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రైవేటు బస్సులకు తగ్గిన ఆదరణ

(5వ పేజీ తరువాయి)



నుంచి హైదరాబాద్ మీదుగా బెంగుళూరుకు ప్రయాణాలు సాగి స్తాయి. గతంలో ఆయా సర్వీసుల్లో నాలుగైదు రోజులు ముందుగానే బుకింగ్‌లు పూర్తయ్యేవి. ప్రస్తుతం వాటిలో ప్రయాణించే వారి సంఖ్య సగానికి పడిపోయినట్లు తెలుస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆపరేటర్లు ఒక్కో టికెట్‌పై రూ. 500 వరకు రిబేటు ఇస్తున్నారు. అయినప్పటికీ ప్రయాణికుల నుంచి పెద్దగా స్పందన లేదని సమాచారం.

ఆర్టీసీ బస్సులకు పెరిగిన ఆదరణ...

కర్నూలు బస్సు ప్రమాదం జరిగిన తరువాత ఆర్టీసీ బస్సులకు ప్రయాణికుల నుంచి ఆదరణ పెరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి నేరుగా బెంగుళూరు వంటి దూర ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు లేకపోయినా... ఈ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు వెళ్లి అక్కడి నుంచి బెంగుళూరు, తదితర ప్రదేశాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగానే ఉంటోంది. ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్‌లోని మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ డిపోల నుంచి నిత్యం 160 సర్వీసులు హైదరాబాద్‌కు ప్రయాణికులను చేర వేస్తుంటాయి.

కర్నూలు సంఘటన జరిగిన నాటి నుంచి మరో పది సర్వీలు పెంచినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. పెరిగిన సర్వీసుల ద్వారా వందల సంఖ్యలో నిత్యం హైదరాబాద్‌కు ప్రయాణం చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రైవేటు బస్సులను ఎక్కేందుకు ఇష్టపడని వారు ఆర్టీసీ సర్వీసులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా రాత్రి వేళల్లో ఆర్టీసీ సర్వీసుల ద్వారా ప్రయాణించే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల డిపో నుంచి గత ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఒక్కసారిగా పెరిగినట్లు ఇక్కడి అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాత్రి సమయంలో రద్దీ పెరగడంతో అదనంగా మూడు సర్వీసులను నడిపినట్లు తెలిపారు.

పత్తా లేని పట్టణ వ్యాపార కమిటీ ఎన్నికలు

● సమస్యలతో సతమతమవుతున్న వ్యాపారులు ● ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్న వ్యాపారులు

మందమర్రిటౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మందమర్రి పట్టణ వ్యాపార కమిటీ ఎన్నికలకు మోక్షం ఎప్పుడు లభిస్తోందో తెలియడం లేదు. 2022 సెప్టెంబరులో పట్టణ వ్యాపార కమిటీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితితో జరిగిన ఎన్నికలు 2023-24లో నిర్వహించాల్సి ఉండగా కొన్ని కారణాలతో వాయిదా వేశారు. ఎన్నికలు లేక దాదాపు పదిహేను నెలలు కావస్తోంది. పట్టణ వ్యాపార కమిటీ సమావేశాలు కూడ లేవని పలువురు సీనియర్ వ్యాపారస్తులు వాపోతున్నారు. వ్యాపారులకు సంబంధించి కొన్ని ప్రధాన సమస్యలు నెలకొని ఉన్నాయి. వ్యాపారాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని చిన్న చితక వ్యాపారులు వాపోతున్నారు. చిరు వ్యాపారస్తులకు సంబంధించి బ్యాంకుల నుంచి రుణాలు పొందాలన్న ఇబ్బందులు పడుతున్నామని పలువురు వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం తమకు నెలకొని ఉన్న సమస్యలు వివరిద్దామంటే సమావేశాలు లేక పోవడం వల్ల ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఎన్నికలు కావాలని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేసే కొందరు మళ్లీ ప్రస్తుతం కమిటీ పక్షాన నిలబడి ఎన్నికలు నిర్వహణ లేకుండా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైన ఎన్నికల నిర్వహణకు ప్రస్తుతం ఉన్న కమిటీ ముందుకు వస్తుందా... వ్యాపారస్తులకు నెలకొన్న సమస్యలు పరిష్కరించి బ్యాంకర్లతో మాట్లాడి రుణాలను ఇప్పిస్తుందా వేచి చూడాల్సిందే...

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.

మంగళవారం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ డిఈ సజ్జత్ భాషాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందిం చేందుకు, ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమ న్వయంతో కృషి చేయాలన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చేనేత ఎన్నికలకు మోక్షం ఎప్పుడో..?

● ఎన్నికలు నిర్వహించాలంటున్న కార్మికులు
● కుంటుపడుతున్న సొసైటీల అభివృద్ధి


చెన్నూరు సొసైటీలో వస్త్రాలు నేస్తున్న కార్మికులు

చెన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు చేయూతనిచ్చేందుకు ఎన్నో థకాలను అమలు చేస్తుంది. అయితే సొసైటీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఏడేళ్లు అవుతున్నా ఇప్పటికీ ఎన్నికలు లేవు. దీంతో సొసైటీల అభివృద్ధి కుంటుపడుతుంది. గత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించక పోవడంతో పర్సన్ ఇన్‌చార్జీలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2013 ఫిబ్రవరి 11న చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2018 ఫిబ్రవరి 11న పదవీ కాలం ముగిసింది. పాలకవర్గం పదవీ కాలం ముగిసిన తర్వాత అప్పటి ప్రభుత్వం జీవో 568 ద్వారా సొసైటీలకు పాత అధ్యక్షులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించింది. ఏడేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా వారితోనే కొనసాగిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బెజ్జూరు, చెన్నూరు చేనేత సొసైటీలు ఉన్నాయి. ఈ సొసైటీల్లో సుమారు 200 మంది కార్మికులు ఉన్నారు. వీటి పరిధిలో ముడి సరుకు తీసుకువెళ్లి ఇంటి వద్ద వస్త్రం తయారు చేసే కార్మికులు మరో 50 మంది ఉన్నారు.

-ఎన్నికలు నిర్వహించే సంఘాలు ఇవే..

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది చేనేత సొసైటీలు ఉండగా నేడు ఆదిలాబాద్, నిర్మల్, లక్సెట్టిపేట, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, దండేపల్లి సొసైటీలు లేకుండా పోయాయి. ప్రస్తుతం కొమురంభీంఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు, మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు సొసైటీలకు మాత్రమే పర్సన్ ఇన్‌చార్జీలు ఉన్నారు. ఆసిఫాబాద్‌లో చేనేత కార్మికులు ఉన్నా సొసైటీ లేకపోవడంతో అధికారులే పర్సన్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. ఇలా పర్సనల్ ఇన్‌చార్జీలు ఉండడంతో సొసైటీల అభివృద్ధి కుంటుపడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు కోరుతున్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

ఇప్పలపల్లి కిష్టయ్య, పర్సన్ ఇన్‌చార్జి, చెన్నూరు



పదవీ కాలం ముగిసి ఏడేళ్లు అవుతుంది. గత ప్రభుత్వం అమలు చేసిన జీవో 568తో పర్సన్ ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నాం. ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించి సొసైటీలను బలోపేతం చేయాలి.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

తాండూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. మంగళవారం తాండూర్‌లో పర్యటించారు. ఐబీలోని పలు దుకాణాల ముందు చెత్తా, చెదారం ఉండడంతో దుకాణాల యాజమానులకు జరిమానాలను విధించారు. దుకాణాల ముందు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం వేస్తే జరిమానాలు విధిస్తామన్నారు. మయల్టీ పర్పస్ వర్కర్ల చేత ప్లాస్టిక్ కవర్లను, చెత్తను తీసివేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం సుభద్ర కాలనీలోని ఉర్దూ ప్రభుత్వ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌కుమార్, కార్యదర్శి దివాకర్ ఉన్నారు.


దుకాణం యజమానికి జరిమానా విధిస్తున్న డీపీవో

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దండేపల్లి, అక్టోబరు, 28(ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ల బ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం స్థానిక తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేసారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ రాఖేష్, డిప్యూటీ తహసీల్దార్ మాధవి, పాల్గొన్నారు.

కుక్కల దాడుల నుంచి కాపాడాలి

బెల్లంపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడుల నుంచి పట్టణ ప్రజలను కాపాడాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు ఎంసీపీఐయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, వెంకటేష్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు వరుసగా దాడులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

పిల్ల కాలువలు నిర్మించి పంటలకు నీరు అందించాలి

హాజీపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : కడెం 42వ డిస్ట్రిబ్యూటర్ కాలువకు పిల్ల కాలువలు నిర్మించి పంటకు సాగు నీరందేల చూడాలని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో 42 డిస్ట్రిబ్యూటర్ కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 65 ఏళ్ల క్రితం నిర్మాణమైన కాలువ ద్వారా హాజీపూర్ మండలంలో 10 వేల ఎకరాల పంట భూములకు నీరందించాల్సిన కాలువ పంటలను ఎండబెడుతుందన్నారు. 15 ఏళ్ల క్రితం వరకు నిరందించి ఆ తర్వాత ఆ కాలువ మరమ్మతులు మర్చిపోయి పంటలకు నీరందించే విధానం ఆగిపోయిందన్నారు. నలభై ఏళ్ల నుంచి కాల్వ మాత్రమే ఉండి నీరు పంట చేనుకు రావడం లేదన్నారు. తలాపునే గోదావరి ఉండి పక్కనే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉండి, గోదావరి ఎత్తిపోతల పథకం కడెం ప్రాజెక్టు నుంచి 65 ఏళ్ల క్రితం నిర్మించిన కాలువలు ఉన్నా ప్రతి యాసంగి పంట నీరు లేక ఎండిపోయి ప్రతి రైతు నష్టపోతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం గత ప్రభుత్వం రూ 45 కోట్లు కాలువ సిమెంట్ లైనింగ్ కోసం కేటాయించినా ఇప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు పూర్తికావడం లేదన్నారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే కాలువలకు పిల్ల కాలువలు, తూములు నిర్మించి ప్రతి ఎకరానికి నీరు పారేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల కృష్ణమూర్తి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటరమణరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్వన్‌రెడ్డి, బీసీ మోర్చా రాష్ట్ర నాయకులు మోటపలుకుల తిరుపతి, మండల జిల్లా నాయకులు మారు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు చెలిమెల శ్రీనివాస్, తిరుపతి, సురేష్, స్వామి, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలి

కన్నెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని వీరాపూర్, గొల్లగట్టు గ్రామాల్లో పర్యటించారు. పారిశుధ్య పనులను, నర్సరీ, వైకుంఠదామంను, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామాల్లో పారిశుధ్య పనులను చేయాలని, రోడ్లపై చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. ఇంటింటికీ చెత్త సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, వైకుంఠదామంలో పిచ్చి మొక్కలు, చెత్త లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణపనులు చేయరాదన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

చేయూత పింఛన్ పెంపేదీ..?



పోస్టాఫీసు వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు



- అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీ
- లబ్ధిదారుల అసంతృప్తి
- స్పష్టత ఇవ్వని సర్కార్

ఆసిఫాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్న చేయూత పెన్షన్ల పెంపు ఊసెత్తడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.2,016 పెన్షన్ ఇచ్చింది. తాము అధికారంలోకి వస్తే చేయూత పెన్షన్లు రెండింతలు చేస్తామని చెప్పింది. కుటుంబంలో ఇద్దరికి సమానంగా పెనన్లు ఇస్తామని 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. కాని ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్న హామీ అమలు కావడం లేదని పెన్షన్‌దారులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వస్తున్న పింఛన్ తమ అవసరాలకు ఉపయోగపడుతున్నప్పటికీ ప్రస్తుతం నిత్యవసరాల ధరలు భారీగా పెరుగడంతో ప్రభుత్వం పెన్షన్ డబ్బులు ఏ మాత్రం సరి పోవడం లేదని పెన్షన్ దారులు వాపోతున్నారు. ప్రభుత్వం పింఛన్ పెంపు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

మేనిఫెస్టో ద్వారా..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వృద్ధులు, దివ్యాం గులు, ఒంటకి మహిళలకు చేయూత పథకం కింద అదనంగా రెండు వేల రూపాయలు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ద్వారా ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ సర్కార్ పింఛన్ల పెంపుపై స్పష్టత ఇవ్వక పోవడంతో లబ్ధిదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. హామీల్లో భా గంగా ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీ అమల్లో నిమగ్నమైన ప్రభుత్వం పింఛన్ పెంపు విషయం మరిచి పోయిందని పెన్షన్ లబ్ధిదారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కొలువు తీరిన ప్రభుత్వం తమ పింఛన్ పెంచుతుందని ఎన్నో ఆశలు ప్రభుత్వంపై పెట్టుకున్నామని పెన్షన్‌దారులు వాపోతు న్నారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్ రూ.2,016 నుం చి రూ.4,016 కు, దివ్యాంగులకు రూ.4,016 నుంచి రూ.6,016కు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెబుతున్నారు. ఆ హామీ ప్రకారం చేయూత పింఛన్ పెంచి ఆదుకోవాలని లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

పింఛన్‌దారులు ఇలా..

జిల్లాలో మొత్తం 56,225 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో వృద్ధాప్య పింఛన్‌దారులు 24,23 5, దివ్యాంగులు 5,974, వితంతులు 22,095, చేనేత పింఛన్ 489, గీత కార్మికులు 139, బీడీ కార్మికులు 86, ఒంటరి మహిళలకు 2,605, ఫైలేరియా బాధితులు 567, డయాలసిస్ బాధితులు 35 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ. 13కోట్లపైగా చేయూ త పింఛన్ల ద్వారా అందజేస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..

\- ఇస్లాంబీన్ హసన్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి



ప్రభుత్వం చేయూత పింఛన్ల పెంపునకు చర్యలు తీసుకోవాలి. నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగాయి. గత ప్రభుత్వం దివ్యాంగులకు చేయూత పింఛ న్ కింద రూ.4,016 ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులుకు ఇచ్చే పింఛన్ రూ.2,016 నుంచి రూ.4,016, దివ్యాంగులకు రూ.4,016 నుంచి రూ, 6,016 ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచి అందజేయాలి.

ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునావర్‌షరీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని పీపీఆర్ కాలనీలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో తహసీల్దార్ మాట్లాడారు. 2026-27 సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనుల ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ గణేష్, ఏపీవో కల్పన, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలి

సిర్పూర్(టి), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసుగూడ, మెటపల్లి గ్రామాలకు పైలేట్ ప్రాజెక్టు కింద మంజూరు చేసిన 50 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలం విషయంలో అధికారులు న్యాయం చేయాలని మంగళవారం గ్రామాల ప్రజలు ఎఫ్ఆర్వో కార్యాలయంలో ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్‌కు, తహసీల్దార్ కార్యాలయంలోని తహసీల్దార్ రహీముద్దీన్‌కు వినతి పత్రాలు అందజేశారు. రెవెన్యూ, అటవీ అధికారులు సర్వేలు నిర్వహించి తాము ఏళ్లుగా నివాసం ఉంటున్నందున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణా లకు స్థలం కేటాయించాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తామన్నారు. గ్రామస్థులకు టీఆర్ఎస్ నాయకుల షేక్ చాంద్, అశోక్ తదితరులు మద్దతు తెలిపారు.

మిగిలిన మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిగిలిన ఏడు మద్యం దుకాణాలకు ఆసక్తి గల ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిసుతన్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎఫ్-బీ27లో నవంబరు ఒకటో తేదీ వరకు అందజేయాలని సూచించారు. నవంబరు 3న మధ్యాహ్నం లక్కీడ్రా నిర్వహించనున్నామని తెలిపారు.

శ్రావణిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి



బాధిత కుటుంబీకుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుమ్రం నీలాదేవి

దహెగాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన తలండి శ్రావణి కులాంతర వివాహం చేసుకున్నదని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుమ్రం నీలాదేవి పోలీసులను ఆదేశించారు. నిండు గర్భిణీ అయిన శ్రావణిని గొడ్డలితో నరికి హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం గెర్రె గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభుయలను పరామర్శించి హత్య సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళను, నిండు గర్భిణీని, పుట్టబోయే బిడ్డను హత్య చేసిన శివార్ల సత్తయయను, సహకరించిన వారందరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తూ నష్ట పరిహారం వెంటనే అందించాలని జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. హత్యలో పాల్గొన్న వారందరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. మహిళలపై రోజు రోజుకు దాడులు పెరిగి పోతున్నాయని నేటి ఆధునిక యుగంలో కుల దురహంకార హత్యలకు పాల్పడడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన దుస్థితన్నారు. ఆమె వెంట డీఎస్పీ వాహిదుద్దీన్, ఎస్సై విక్రమ్ తదితరులు ఉన్నారు. అలాగే శ్రావ ణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలు సంఘాల నాయకులు కమిషన్ సభ్యురాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.

కోతుల బెడద నుంచి రక్షించాలి



అటవీశాఖ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు, ప్రజా సంఘాల నాయకులు

కెరమెరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలో కోతుల బెడద నుంచి రక్షించాలని మంగళవారం ప్రజా సంఘాలు, వ్యాపారుల ఆధ్వర్యంలో రాస్తాకోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండల కేంద్రంలో కోతుల బెడదతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని, పెంకుటిళ్లపై నుంచి నిత్యావసర సరుకులు ధ్వంసం చేస్తున్నాయని చెప్పారు. దుకాణాల్లో వస్తువులను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. అటవీ అధికారులు స్పందించి కోతులను పట్టుకోవాలని కోరారు. గ్రామ సమీపంలో సాగు చేస్తున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంతకు ముందు అంబేద్కర్ చౌక్ నుంచి అటవీ శాఖ కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించి అటవీ శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కిరాణ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్, శ్యాంరావు, శ్రీనివాస్, వినేష్, ఆనంద్‌రావు, తిరుపతి, రమేష్, స్వామి, సంతోష్, సలీం, మానిక్ రావు, ముజ్జు, పోశన్న, శేఖర్, జగదీష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై మహేందర్

వాంకిడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై మహేందర్ అన్నారు. కేజీబీవీ విద్యాలయంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థుల మాదకద్రవ్యాలకు ఏ విధంగా దూరం ఉండాలి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ఒక సారి అలవాటయితే జీవితాన్ని చీకట్లోకి నెడతాయన్నారు. పోలీసులు మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో ముందుండి పోరాడుతున్నారని చెప్పారు. యువత కూడా జాగ్రత్తగా ఉండి ఈ ప్రమాదకర అలవాట్లను పూర్తిగా దూరం పెట్టాలని సూచిచారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓ మీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో పాము కలకలం



గ్రామస్థులు చంపి వేసిన పాము

కెరమెరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ఆఫీసు గదిలో పాము కలకలం సృష్టించింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే పామును కొట్టి చంపారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

కాగజ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటినిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల్లో ఎలాంటి ఆలస్యం చేయవద్దన్నారు. త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ఎలాంటి సమస్యలున్నా కూడా లబ్ధిదారులు వెంటనే అధికారులను సంప్రదించాలన్నారు. పెండింగ్ పెట్టకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ పథకం లబ్ధిపొందిన లబ్ధిదారులకు గూడు దొరుకుతుందన్నారు. ఇంటి నిర్మాణాల కోసం ఉచితంగా ఇసుకను అందిస్తున్నామని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ మధూకర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): నైపుణ్యతను పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్ సుప్రభాత్ పాఠశాలలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం కింద నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఉపాధి కల్పన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హరీష్ బాబుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, తహసీల్దార్ మధూకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత బ్లాక్‌లో భాగంగా జిల్లాలోని తిర్యాణి మండలంలో చేపట్టిన పనులపై పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి తిర్యాణి మండలంలో చేపట్టిన కార్యక్రమాలపై విద్య, వైద్య, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాక్‌లో భాగంగా తిర్యాణి మండలంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని, కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి పనుల పురోగతిపై పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేసి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ శాఖా ధికారి భాస్కర్, ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదే వరెడ్డి, విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త అబిద్ అలీ, ఎంపీడీవో మల్లేష్, పంచాయతీరాజ్, సమగ్ర గిరిజనా భివృద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

చట్టాలపై అవగాహన

రెబ్బెన, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం తక్కళ్లపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస పాఠశాలలో మంగళవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు, ఏఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షణలో భరోసా టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరోసా టీం ఇన్‌చార్జి డబ్ల్యూఎస్ఐ తిరుమల మాట్లాడుతూ బాధితులకు రక్షణ, న్యాయం అందించడంలో భరోసా సెంటర్లు అందుబాటులో ఉంటామని తెలిపారు. అత్యాచారాలు, వేధింపులు, సేఫ్ టచ్-అన్‌సేఫ్ టచ్, పోక్సో చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, మహిళల భద్రతకు తదితరాలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని మహిళలు, బాలికల భద్రత కోసం భరోసా సెంటర్, షీ టీం నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి వేధింపులకు గురైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్లావేళలా అధికారులు సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటారని చెప్పారు. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, భరోసా టీం సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో నాణ్యత పాటించాలి



వాంకిడిలో ఇందిరిమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్యోత్స్న

కెరమెరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీవో సురేష్ అన్నారు. కోటారి గ్రామ పంచాయతీలో ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎన్ని మంజూరు అయ్యాయి అవి ఏఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఐసీడీఎస్ భవన నిర్మాణ పనులను పరిశీ లించారు. ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల విద్యాబోధన, సామర్థ్యాలను పరిశీలిం చారు. ఆయన వెంట ఎంపీవో అంజద్‌పాషా, కార్యదర్శి సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పను లను సకాంలో పూర్తి చేయాలని ఎంపీడీవో జ్యో త్స్న అన్నారు. వాంకిడి, చౌపన్‌గూడ, పాటగూడ గ్రామ పంచాయతీల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పాటగూడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం పిల్లలకు భోజనాన్ని అందించాలని హెచ్ ఎంను ఆదేశించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, ఏపీ వో శ్రావణ్, కార్యదర్శులు శివకుమార్, అన్నపూర్ణ, సంగీత ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులను పాఠశాలలకు పంపించాలి

కెరమెరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులను పాఠశాలలకు క్రమం తప్పకుండా పంపించాలని ఎంఈవో ప్రకాష్ అన్నారు. మంగళవారం ఆయన భీమన్‌గొంది గ్రామస్థలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో విద్యార్థులు విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరు అయితే నష్ట పోతారని చెప్పారు. వారిని వ్యవసా పనులకు తీసుకెళకూడదని సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమంగా ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. అందుకే క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ భీము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్స వాల్లో భాగంగా మంగళవారం సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కెరమెరి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 71 మంది యువత రక్తదానానికి ముందుకు తరలివచ్చారు. కార్యక్రమంలో యువతను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనోర గ్రామంలో రైతు కేంద్రె బాలాజీ సాగు చేసుత్ను యాపిల్ తోటను మంగళవారం ఏఎస్పీ చిత్తరంజన్ పరిశీలించారు. యాపిల్ తోటలతో పాటు బతాతయి, కృష్ణఫల, మామడి చెట్లను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగు విధానం, సేంద్రియ ఎరువుల తయారి విధానం, వాడకం తదితర విషయాలను రైతు బాలాజీ ఆయనకు వివరించారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఛట్ పూజలు



ఛట్ పూజల్లో పాల్గొన్న మహిళలు

కాగజ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం ఛట్ కొలనులో సోమవారం నుంచి చేపట్టిన ఛట్ పూజలు మంగళవారంతో ముగిశాయి. మంగళవారం ఉదయం 3 గంటల నుంచి ఛట్ కొలనులోని నీటిలో సూర్యదేవుడిని ప్రార్థిస్తూ పూజలు చేశారు. సూర్యోదయం కాగానే హారతులు పడుతూ ఛట్ పూజను పూర్తి చేశారు. ఛట్ పూ జల సందర్భంగా ఎస్పీఎం యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. జడ్పీ ఇన్‌చార్జి మాజీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావుతో పాటు ఎస్పీఎం మిల్లు ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్ విజయ్ కుమార్ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

రెబ్బెన, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సైబర్ సెక్యూరిటీపై జీఎం విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆర్థిక నేరాలు, భౌతిక దాడులతో జరిగేవని నేడు సాంకేతిక(టెక్నాలజీ)తో జరుగుతున్నాయని అన్నారు. ఉద్యోగులు వారి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు పాస్‌వర్డ్‌లు, కుటుంబ సభ్యుల ఫోటోలను ఇంటర్నెట్‌లో పొందుపర్చవద్దని సూచించారు. అనంతరం ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో డీజీఎం శ్రీనివాసరావు, ఫర్నవీస్, నరేందర్, కృష్ణమూర్తి, ఉమాకాంత్, రంగాచారి, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి